# ఇద్దరు యువకులు....

వి. సువర్ణ



"సార్ మీరు మీ సీట్లోంచి లేచి మీ సీటు ఆయన కివ్వండి సార్..." అని కండక్టర్ అన్న మాటలు తనని కాదన్నట్లుగా ఎటో చూస్తున్నాడా యువకుడు. అయినా కండక్టర్ వూరుకోలేదు. మళ్ళీ అన్నాడు.....

"అయ్యా, తమర్నేనండీ.....! ఈ సీటు అంగ వికలురకు అని పైన తాటి కాయలంత అక్షరాలతో వ్రాసుంటే మీకు కనిపించలేదా....? అంగ వికలురు ఎవరూ బస్సెక్కకపోతే మీరు కూర్చున్నా ఫరవాలేదు..... పాపం అటు ఆయన వైపు చూడండి ఒంటి కాలి మీద నిల్చోలేక ఎలా తంటాలు పడుతున్నాడో..... ఆ అవిటి ఆయన బస్సు ఎక్కిన వెంటనే మీరు లేచి ఆయనకి సీటు ఇవ్వాల్సింది పోయి, ఇందాకటి నుంచీ నేను గొంతు చించుకు చెప్తున్నా సీటు ఇవ్వరేమిటండీ..... అంగవికలుడుకి.... అని కండక్టరు గర్జించేసరికి కూర్చున్న యువకుడుకి సీట్లోంచి లేవక తప్పలేదు.

"ఫరవాలేదు కండక్టర్ సార్..... నేను కర్రసాయంతో నిల్చో గలను....." అన్నాడు ఒక కాలు లేని అంగవికల యువకుడు.......

".... మీరు కూర్చోండి సార్......" అని కండక్టర్ చెప్పేసరికి ప్రశాంత్, శంభు ఖాళీ చేసిన సీట్లో కూర్చుంటే, నిల్చున్న శంభు, బస్సు కుదుపులకు పడిపోకుండా పై నున్న ఇనుప రాడ్‌ని గట్టిగా పట్టుకు నిల్చుని కోపంగా కండక్టర్నే చూస్తున్నాడు.

శంభు అప్రయత్నంగా ప్రశాంత్ ఒళ్లో పట్టుకున్న కవరు వైపు చూశాడు... అరే ...... ఆ కవరు మీదున్న ఫ్రమ్ అడ్రస్ తను ఇంటర్వ్యూకి వెడుతున్న కంపెనీ అడ్రసే..... అనుకున్న శంభు హృదయం భగ్గుమంది..... బస్సులోనే పోటీ అనుకుంటే ఉద్యోగానికి కూడానా......?"

యువకులిద్దరూ ఒకే స్టాపులో దిగారు..... రెండు కాళ్లతో నడవ కలిగిన శంభు గబగబా నడుచుకుంటూ తను వెళ్ల వలసిన ఆఫీసుకి చేరుకుంటే, ఒక కాలుతో కుంటుకుంటూ నడుస్తూ కొంచెం ఆలస్యంగా అదే ఆఫీసుకొచ్చాడు ప్రశాంత్...... వచ్చి శంభూ పక్కనే కూర్చున్నాడు.

ఇంటర్వ్యూలో ఏం ప్రశ్నలడుగుతారో, తను సరిగా సమాధానాలు చెప్ప కలుగుతాడో లేదోనని శంభూ తెగ టెన్షన్‌గా వున్నాడు.

ప్రశాంత్ సార్ధక నామధేయుడు..... ఏ మాత్రం కంగారు పడకుండా ప్రశాంతంగా కూర్చున్నాడు....

అతని ప్రశాంతత చూస్తున్న శంభుకు కోపంగా వుంది.

ప్రశాంతంగా వుండకేం చేస్తాడు.... ఎట్లాగూ తనకే ఆ ఉద్యోగం వస్తుందన్న ధీమా.... ఏ క్వాలిఫికేషన్లు లేకపోయినా వుందిగా అవిటితనం అనే పెద్ద క్వాలిఫికేషన్.

అప్పుడటుగా వెడుతున్న అటెండెరుని పిలిచి తన చేతి లోని పెద్ద పొడుగాటి కవరు అతని చేతికిచ్చి ఎమ్. డి.కివ్వమన్నాడు.

"ఓ హో ఏ వీ.ఐ.పీ. దగ్గర నుంచో రికమండేషన్ కూడా తెచ్చుకున్నట్లున్నాడు. మండే మనసుతో అనుకున్నాడు శంభు. ఆ తరువాత ప్రశాంత్ పక్కన కూర్చోలేక శంభు లేచి వెళ్ళి బెంచికి మరో వైపున కూర్చున్నాడు.

....సార్, ఈసారి ఇక్కడ అమ్మాయిలెవరూ మనకి పోటీగా రాలేదనకుంటే అంతకంటే పెద్ద పోటీగా వచ్చాడే కుంటి వాడొకడు.... అన్నాడు శంభు తన పక్కన కూర్చున్న తనితో కొంచెం పెద్ద కంఠంతో ప్రశాంత్‌కి వినపడేట్లుగా.

"అవును సార్.........! ఈ రోజుల్లో ఉద్యోగాలు రావాలంటే ఒకటి ఆడపుటుక పుట్టాలి.... రెండోది అవిటి వాడుగా పుట్టాలి. లేదా అవిటి వాడవాలి...... అని శంభు మాటలకు వత్తాసు పలికాడు ఆ పక్కన కూర్చున్నతను.

"అన్నీ అవయవాలు బాగున్న మనకి ఉద్యోగాలు రావడం చాలా కష్టం....." అని మరోడన్న మాటలు ప్రశాంత్‌కి వినిపించాయని శంభూ అనుకున్నాడు.

చేతి కందింది నోటికందకుండా తన్నుకు పోయే గద్ద లాగున్నాడే..... అనుకుని శంభు మహా బాధ పడిపోతున్నాడు.

"సార్ మిమ్మల్ని ఎమ్.డి. పిలుస్తున్నారు....." అని అటెండరు వచ్చి ప్రశాంత్‌తో చెప్పగానే చంకల కింద క్రైచెస్ పెట్టుకుని టకటకా చప్పుడు చేసుకుంటూ లోపలి కెళ్లాడు ప్రశాంత్.

మొదటి పిలుపే అతనికి.... అని శంభు అనుకుంటూండగానే ఎమ్.డీ చేంబర్ లోంచి బయటికొచ్చాడు ప్రశాంత్ హండ్రెడ్ వాట్స్ బల్బులా కాంతి వంతంగా వెలుగుతున్న మొహంతో.

వెలుగదూ మరీ హండ్రెడ్ వాట్స్ బల్బులాను వెలుగుతుంది థౌంజండ్ వాట్స్ బల్బులాను వెలుగుతుంది. సునాయాసంగా ఉద్యోగం కొట్టేస్తాను..... అనుకుంటున్న శంభు వద్దకు ప్రశాంత్ వచ్చి .... సార్ నేను మిమ్మల్ని బస్సులోంచే కని పెడుతూనే వస్తున్నాను.... నేను ఇక్కడికి ఉద్యోగం కోసం రాలేదు మీరు అనుకున్నట్లుగా....

'నేనో చిన్న తరహా పరిశ్రమ నడుపుతున్నాను... ఇలాంటి పెద్ద పెద్ద ఫ్యాక్టరీలకు కావాల్సిన స్పేర్ పార్ట్స్ తయారు చేసి సప్లై చేస్తాను....

"నేను చేసే సామాన్లు కావాలంటూ ఈ ఫ్యాక్టరీ ఎమ్.డి. టెండర్స్ కాల్‌ఫర్ చేశారు.... నేనూ టెండర్ వేశాను... నా టెండర్ తక్కువ రేటు, నాణ్యత వుండడం వల్ల ఆ ఆర్డర్సు నాకే ఇచ్చారు.

....ఎమ్.డీ గారూ మరో రెండు ఫ్యాక్టరీలకు కూడా సప్లై చెయ్యాలంటూ లెటరు వ్రాయడం వల్ల ఆ ఆర్డర్సు పట్టుకెడదామనే వచ్చానే కానీ ఉద్యోగం కోసం రాలేదండీ...." అని ప్రశాంత్ మాటలకు శంభుకి ఏం చెప్పాలో తెలియక అలాగే అతన్ని ఆశ్చర్యంగా చూస్తూండిపోయాడు శంభు.

"నా పేరు ప్రశాంత్.... మీ పేరేమిటండీ....?" అని అడిగిన ప్రశాంత్‌కి తనకి తెలియకుండానే..... శంభు...." అని చెప్పాడు.

"మిష్టర్ శంభూ..... ఇప్పుడు నేను తీసుకున్న ఆర్డరుని సకాలంలో సప్లై చెయ్యాలంటే నా ఫాక్టరీని పెద్దది చెయ్యాలి... పని చెయ్యడానికి మనుష్యులు కావాలి.

ఇక్కడ ఉద్యోగానికి సెలక్టు కాకపోతే మా ఫాక్టరీకి రండి... మీరు మాత్రమే కాదు... మీకు తెలిసిన వాళ్లెవరైనా వున్నా తీసుకురండి.... నేను జాబ్ ఇస్తాను...." అన్న ప్రశాంత్ తన విజిటింగ్ కార్డు శంభూకి ఇచ్చాడు.... అది అందుకుంటున్న శంభుకు ఎప్పుడూ తల్లి అనే మాటలు గుర్తుకొచ్చినయ్యి.

"వురేయ్, శంభూ, ఎందుకొచ్చిన ఇంటర్వ్యూలురా.... వెళ్లి వెళ్లి విసుగెత్తడమే కానీ ఇంత వరకు ఒక్క ఉద్యోగం అయినా వచ్చిందా.... ఒకరికింద నువ్వెందుకురా ఉద్యోగం చెయ్యడం, చేతులు కట్టుకుని... గడియారం ముళ్లు చూసుకు ఆఫీసుకు పరిగెత్తడం... ఒకటో తేదీ కోసం నెలంతా నోరు తెరుచుకు చూడడం ఇవన్నీ నాకు ఇష్టం లేదురా....


"నువ్వే పది మందికి ఉద్యోగం ఇచ్చి ఒకటో తేదికి నువ్వే వాళ్లకి జీతం ఇవ్వ కలిగేటటువంటి సొంతంగా ఓ బిజినెస్ చెయ్యి, ఫాక్టరీ ప్రారంభించు....." అన్నది తల్లి.

"అమ్మా బిజినెస్ చెయ్యడం, పరిశ్రమలు స్థాపించడం అంత తేలిక కాదు... ఎన్నో తిప్పలు పడాలి... ఆ తిప్పలు పడే ఓపిక నాకు లేదమ్మా......

"తిప్పలుకి భయపడి ఎన్నాళ్లని ఇలా ఇంటర్వ్యూలకని వెళ్లి వస్తావు... ఎప్పటికి నీకు ఉద్యోగం దొరుకుతుంది.... నువ్వెప్పటికి ఉద్యోగస్థుడవుతావు..... ప్రభుత్వం నీ బోటి ఇంజనీరింగు గ్రాడ్యుయేట్లు సొంత పరిశ్రమలు పెట్టుకునేందుకు ఎన్నో సౌలభ్యాలు ఇస్తోంది...... అని అమ్మ ఎన్ని విధాల చెప్పినా వినకుండా పేపర్లో వచ్చిన ప్రతి ప్రకటనకు అప్లై చేస్తూ, ఇంటర్వ్యూలకి వెడుతున్నా ఇంతవరకూ ఉద్యోగం మాత్రం రాలేదు.....

నడవలేని ప్రశాంత్ పరిశ్రమ పెట్టుకుని శ్రమిస్తూంటే అన్నీ బాగున్నా నేను మాత్రం ఎందుకు పరిశ్రమను నడపలేను.... అనుకున్న శంభు హృదయంలో ఓ పరిశ్రమ రూపు దిద్దుకుంటున్నది. ❃

## గ్రేట్ యాక్టర్స్



తూర్పు పడమర ఎప్పుడైనా కలుస్తాయా? ఉత్తర దక్షిణాలు ఎప్పుడైనా కలుస్తాయా? కాని కలిశాయి. స్టేట్‌లో స్టేట్‌మెంట్స్‌తో ప్రచ్ఛన్న యుద్ధం ప్రకటించుకొనే ఈ తెరవెనక నటకాగ్రేసరులు ఎంత హాయిగా ఆనందంగా చిద్విలాసంగా.... చిరునవ్వులు రువ్వుకుంటున్నారో చూడండి.

'దాసరి' నటుడు, దర్శకుడు గనుక ముఖంలో అవసరమయ్యిన ఎక్స్‌ప్రెషన్ రాబట్ట గలడు. కాని చంద్రబాబు మాత్రం తక్కువ తిన్నాడా! అదే వింత గ్రేట్ యాక్టర్సంటే వీరే!!

- సాయిరాం